సాక్షి
నారాయణపేట
సోమవారం : 2, అక్టోబర్ : 2023



ధ్వంసమైన చెక్‌డ్యాంలు

రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన చెక్‌డ్యాంలు నాణ్యత లేక అనతికాలంలోనే దెబ్బతింటున్నాయి.

వివరాలు 8లో ▸



కాటేస్తున్న కాలుష్యం

పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థ జలాలతో భూములు కాలుష్యమై పంటలు పండటం లేదు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
34.7 /22.6

వాతావరణం

ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతం అవుతుంది. ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పోలీస్ యాక్ట్ పొడిగింపు

నారాయణపేట రూరల్: జిల్లాలో పోలీస్ యాక్ట్ 30, 30ను అక్టోబర్ 31 వరకు పొడిగించినట్లు ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. ప్రజలు, రాజకీయ నాయకులు, ప్రభుత్వ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టరాదని, బహిరంగ సభలు నిర్వహించొద్దని పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులకు నష్టం కలిగించినా, ప్రాణనష్టం జరిగినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు

ఐటీఐలో స్పాట్ అడ్మిషన్లు

నారాయణపేట రూరల్: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో మిగిలిన సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ వేమారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పది, 8వ తరగతి పాసైన విద్యార్థులకు అవకాశం ఉందని.. 8వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని 9న మహబూబ్‌నగర్ ఐటీఐ బాలికల కళాశాలలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని పేర్కొన్నారు.

ముస్లింల భారీ ఊరేగింపు



నారాయపేట రూరల్: మిలాద్–ఉన్–నబీని పురస్కరించుకొని ఆదివారం ముస్లింలు పట్టణంలోని లాల్‌మసీద్ నుంచి బువ్వమ్మ దర్గా వరకు జెండాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. దారి పొడవునా వివిధ పార్టీల నాయకులతో పాటు పలు స్వచ్ఛంద సంస్థల వారు తాగు నీరు, మజ్జిగ పంపిణీ చేశారు. ముస్లిం మతపెద్దలకు మిఠాయిలు తినిపించి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. మహ్మద్ ప్రవక్త శాంతి, సహనానికి ప్రతిరూపమని.. ఆయన జీవితం మానవాళికి ఆదర్శనీయమని వివరించారు. కాంగ్రెస్ యువ నాయకుడు అభిజిత్‌రెడ్డి కార్యక్రమంలో పాల్గొని శుభాకాంక్షలు తెలుపడంతో పాటు వారికి మిఠాయిలు పంచారు. దర్గా పీఠాధిపతి సయ్యద్ గయాసుద్దీన్ ఖాద్రి, మతపెద్దలు నవాస్ మూసా, సలీం, అమీరోద్దీన్, కౌన్సిలర్లు సలీం, తాఖీచాంద్, పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ఆందోళన ఉద్రిక్తం

నారాయణపేట రూరల్: పట్టణంలో ఆదివారం అంగన్‌వాడీలు నిర్వహించిన ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో సత్యనారాయణ చౌరస్తాలో అంగన్‌వాడీలు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అదే సమయంలో అటుగా వచ్చిన అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిత్తల్ వాహనానికి దారి ఇవ్వకపోవడంతో మరో దారిలో కార్యాలయానికి చేరుకున్నారు. వెంటనే పోలీసులకు ఫోన్‌చేసి 30 యాక్ట్ అమలులో ఉండగా అంగన్‌వాడీల రాస్తారోకోకు ఎలా అనుమతిచ్చారని ప్రశ్నించారు. దీంతో డీఎస్పీ సత్యనారాయణ, సీఐ రవిబాబు రాస్తారోకో ప్రాంతానికి చేరుకొని అనుమతి లేకుండా నిరసన చేయడం సరికాదని.. అంగన్‌వాడీల సమస్య పరిష్కారం అయినట్లు వార్తలు వస్తున్నాయని వివరించారు. అధికారికంగా తమ సంఘానికి ఎలాంటి సమాచారం లేదని వారించారు. ఈ క్రమంలో సీఐటీయూ నాయకుడు బలరాం, పోలీసులకు మధ్య తోపులాట జరగగా బలరాంకు, సీఐ, కానిస్టేబుళ్లకు స్వల్ప గాయాలైనట్లు సమాచారం. బలరాంపై పోలీసుల దాడిని సీపీఎం నాయకుడు వెంకట్రామారెడ్డి, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు రాము, పీవైఎల్ నాయకుడు కాశీనాథ్ ఖండించారు. ప్రభుత్వ కార్యకలాపాలు, ఇతర విషయాలకు అడ్డుపడుతున్నందున పలు సెక్షన్ల కింద బలరాంపై కేసు నమోదు చేయనున్నట్లు డీఎస్పీ వెల్లడించారు.



బహిరంగసభలో నమస్కరిస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ. వేదికపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాజ్యసభ ఎంపీ లక్ష్మణ్, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, ఎమ్మెల్యేలు ఈటల రాజేందర్, రఘునందన్‌రావు, మాజీ ఎంపీలు జితేందర్‌రెడ్డి, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, రవీందర్‌నాయక్, నాయకులు మురళీధర్‌రావు, చింతల రామచంద్రారెడ్డి, బంగారు శ్రుతి, ఆచారి, పి.చంద్రశేఖర్, తదితరులు

ఆకర్షించేలా.. ఉత్తేజపరిచేలా..

ప్రధానమంత్రి మోదీ రాకతో బీజేపీ శ్రేణుల్లో జోష్

- ప్రజాగర్జన సభలో అన్ని వర్గాలు లక్ష్యంగా కేంద్ర పథకాల ప్రస్తావన
- జనసంద్రాన్ని చూసి జన్మ ధన్యమైందన్న ప్రధాని
- పసుపు బోర్డు, ములుగులో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుపై హర్షాతిరేకాలు
- 'పాలమూరు'కు ప్రత్యేక హామీ లేకపోవడంపై విమర్శల వెల్లువ



వర్చువల్‌గా పలు పథకాలను ప్రారంభిస్తున్న ప్రధాని నరేంద్రమోదీ. చిత్రంలో గవర్నర్ తమిళిసై, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ బండిసంజయ్



ప్రభుత్వ అధికారిక కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: 'ఈ జనసంద్రం చూస్తుంటే ఎంతో సంతోషంగా ఉంది. మీ అందరూ ఇంత పెద్దసంఖ్యలో వచ్చి ఆశీర్వాదం ఇచ్చారు. వరుణ దేవుడు కూడా.. ఇక్కడ ఏర్పాటు చేసిన సభ వల్ల చాలా ఏళ్ల తర్వాత పాత స్నేహితులు, పెద్ద సంఖ్యలో తెలంగాణ ప్రజలను చూసే అవకాశం దక్కింది. నా జన్మ ధన్యమైంది.'అంటూ ప్రధాని నరేంద్రమోదీ ఉద్వేగంగా మాట్లాడారు. భూత్పూర్ మున్సిపాలిటీ పరిధి అమిస్తాపూర్‌లోని ఐటీఐ కాలేజీ ప్రాంగణంలో ఆదివారం ఏర్పాటు చేసిన పాలమూరు ప్రజాగర్జన బహిరంగ సభలో ప్రధాని నరేంద్రమోదీ ప్రసంగం అన్ని వర్గాలను ఆకట్టుకునే విధంగా.. బీజేపీ శ్రేణుల్లో ఉత్తేజం నింపేలా కొనసాగింది. పాలమూరు ప్రజలందరికీ నమస్కారం .. శుభాభివందనాలు.. నా కుటుంబ సభ్యుల్లారా అని తెలుగులో సంబోధిస్తూ హిందీలో ప్రసంగం మొదలుపెట్టారు. యువత, మహిళలు, వ్యాపారులు, రైతులు, కార్మికులు, గ్రామీణులు, పట్టణ ప్రాంత ప్రజలు ఇలా అన్ని వర్గాల వారిని ఆకర్షించేలా.. బీఆర్ఎస్, కాంగ్రెస్‌పై విమర్శల జల్లుతో బీజేపీ అభిమానులను హుషారెత్తించారు. రాష్ట్రంలో రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పాలమూరు వేదికగా బీజేపీ ఎన్నికల శంఖారావం పూరించినట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

ఈ ప్రాజెక్టులతో కొత్త శిఖరాలకు..

పాలమూరులో ఏర్పాటు చేసిన ఈ వేదికపై నుంచి తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం ఎన్నో ప్రాజెక్టులను జాతికి అంకితం చేసినందుకు సంతోషంగా ఉందన్నారు. సుమారు రూ.13,500 కోట్ల విలువైన ప్రాజెక్టులు కొత్త శిఖరాలకు తీసుకెళ్తాయని.. తెలంగాణ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. తెలంగాణ ప్రజలు మార్పు కోరుతున్నారని.. అబద్ధపు, తప్పుడు హామీలు కాకుండా నిజమైన అభివృద్ధిని ఆకాంక్షిస్తున్నారన్నారు. ఇక్కడ జనసంద్రం చూస్తుంటే ఇది స్పష్టమవుతోందన్నారు.

- ఇటీవలే నారీశక్తి వందన్ మహిళా రిజర్వేషన్ చట్టాన్ని సాధించుకున్నామని.. కేవలం పార్లమెంట్‌లో కాకుండా ప్రతి అసెంబ్లీలో గతం కంటే మహిళల ప్రాతినిధ్యం ఎక్కువగా ఉంటుందని మోదీ అన్నారు. మహిళల గౌరవం కోసం మరుగుదొడ్లు నిర్మించామని, ఎలాంటి గ్యారంటీ లేకుండా ముద్ర రుణాలు అందజేస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి గ్రామంలోని ప్రజలు పట్టణ ప్రాంతాలకు వెళ్లడానికి వీలుగా ఉండాలన్నదే ధ్యేయమని.. దీని వల్ల వ్యాపారులు, రైతులు, ఉద్యోగులు, విద్యార్థులకు ఎంతో వెసులుబాటు లభిస్తుందన్నారు. రైతుల శ్రమకు తగ్గిన ప్రతిఫలం ఇస్తున్నామంటూ పీఎం కిసాన్‌తో పాటు ముద్ర రుణాలు, పీఎం విశ్వకర్మ యోజన అంటూ పలు కేంద్ర పథకాలను ప్రస్తావించారు. కార్యక్రమంలో కేంద్రమంత్రి, రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్, ఎంపీలు బండి సంజయ్, ధర్మపురి అర్వింద్, ఎమ్మెల్యేలు ఈటల రాజేందర్, రఘునందన్‌రావు, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, నాయకులు మురళీధర్‌రావు, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, చింతల రామచంద్రారెడ్డి, బంగారు శ్రుతి, ఆచారి, పి.చంద్రశేఖర్, నాగురావు నామాజీ, శ్రీవర్ధన్‌రెడ్డి, పద్మజారెడ్డి, శాంతికుమార్, కొండయ్య, వీర బ్రహ్మచారి, ఎల్లేని సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.
- పాలమూరు ప్రజాగర్జన బహిరంగ సభ విజయవంతం కావడంతో సభ ముగిసిన అనంతరం డీకే అరుణను ప్రధాని మోదీ ప్రత్యేకంగా అభినందించారు.

'పాలమూరు' ప్రస్తావన లేకపోవడంపై విమర్శల వెల్లువ

తెలంగాణలో సాగునీటి ప్రాజెక్టుల ఆర్భాటంగా ప్రారంభోత్సవాలు జరుగుతాయని.. కానీ రైతులకు నీళ్లు మాత్రం ఇవ్వరు.. వీటిని తెలంగాణ రైతులు గమనిస్తున్నారన్నారు అని మోదీ అన్నారు. ఈ మేరకు పరోక్షంగా ఆయన పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును ఉద్దేశించి విమర్శించినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇదే క్రమంలో రాష్ట్రంలో జాతీయ పసుపు బోర్డు (నేషనల్ టర్మరిక్ బోర్డు), సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించిన మోదీ.. పాలమూరులో సభ పెట్టి ఈ ప్రాంతానికి మేలు చేకూరేలా ఎలాంటి ప్రత్యేక హామీలు ఇవ్వకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వచ్చే ఎన్నికల్లో కాషాయ జెండా ఎగురవేస్తాం: కిషన్‌రెడ్డి

తెలంగాణలో జాతీయ గిరిజన విశ్వవిద్యాలయం, జాతీయ పసుపు బోర్డు ఏర్పాటు చేస్తానని మోదీ ప్రకటించడం గర్వకారణమని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. దళిత సీఎం, దళిత బంధు, నిరుద్యోగ భృతి అంటూ కేసీఆర్ ఇచ్చిన ఏ హామీ అమలు కాలేదని, 1200 మంది ఆత్మ బలిదానాలు చేసుకుని సాధించుకున్న తెలంగాణ ప్రస్తుతం ఏ విధంగా ఉందో ప్రతి ఒక్కరూ గమనించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో గోల్కొండ కోటపై కాషాయం జెండా ఎగురవేసి, నీతివంతమైన పాలన అందిస్తామన్నారు.

- బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఏపీ జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ విశ్వగురువు యోజన పాలమూరుకు రావడంతో సంతోషకరమని, ఇటీవల జీ–20సదస్సుతో పాటు మహిళ బిల్లును విజయవంతంగా పూర్తి చేశారన్నారు. పాలమూరులో బీజేపీ నిర్వహించిన ప్రజాగర్జనకు వచ్చిన జనాలను చూసి కేసీఆర్‌కు నిద్ర పట్టదని విమర్శించారు.



అమిస్తాపూర్‌లో ఏర్పాటు చేసిన సభాప్రాంగణంలోని షెడ్డులో కూర్చున్న బీజేపీ కార్యకర్తలు, ప్రజలు

సైడ్‌లైట్స్..

ప్రధాన నరేంద్రమోదీ పర్యటన పాలమూరులో 2.40 గంటల పాటు సాగింది. అధికార కార్యక్రమంతో పాటు బహిరంగ సభలో రెండు వేదికలపై ప్రసంగించారు. అనంతరం గుజరాత్ నుంచి ప్రత్యేకంగా తెప్పించిన చైతన్యరథంలో 20 నిమిషాల పాటు అభివాదం చేస్తూ అధికారిక కార్యక్రమం నుంచి సభావేదిక వద్దకు చేరుకున్నారు.

- మధ్యాహ్నం 2.17 గంటలకు గవర్నర్ తమిళిసై, ఎంపీ బండి సంజయ్ రాక
- 2.18 గంటలకు ప్రధాని నరేంద్రమోదీ హెలీకాప్టర్ ల్యాండింగ్, స్వాగతం పలికిన రాష్ట్ర బీజేపీ నాయకులు, స్థానిక నేతలతో
- 2.41 గంటలకు ప్రధాని మోదీ సభావేదిక వద్దకు రాక. 2.43 గంటలకు మోదీకి కిషన్‌రెడ్డి జ్ఞాపిక అందజేత
- 2.44 గంటలకు కిషన్‌రెడ్డి ప్రసంగం.. 2.52 గంటలకు పూర్తి
- 2.55 గంటలకు రూ.13,545 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులకు వర్చువల్‌గా శంకుస్థాపన, ప్రారంభోత్సవం
- 2.56 గంటలకు డాక్యుమెంటరీ ప్రదర్శన.. 3.01 గంటలకు పూర్తి
- 3.02 గంటలకు కాచిగూడ–రాయచూర్ రైలుకు పచ్చ జెండా ఊపి ప్రారంభం
- 3.04 గంటలకు మోదీ ప్రసంగం మొదలు.. 3.16 గంటలకు పూర్తి
- 3.18 గంటలకు పాలమూరు ప్రజాగర్జన బహిరంగ సభకు బయలుదేరిన మోదీ
- 3.22 గంటల నుంచి 3.42 గంటల వరకు ఓపెన్ టాప్ జీప్‌లో ప్రజల మధ్య అభివాదం చేస్తూ ర్యాలీ.. మహిళలు పూలు చల్లుతూ ఘన స్వాగతం
- 3.50 గంటలకు సభా వేదిక పైకి ప్రధాని మోదీ రాక
- 4.06 గంటలకు ప్రధాని ప్రసంగం ప్రారంభం, 4.46 గంటలకు ప్రసంగం పూర్తి
- 5.00 గంటలకు హెలికాప్టర్‌లో శంషాబాద్ విమానాశ్రయానికి బయలుదేరిన మోదీ.

- అమిస్తాపూర్ వద్ద నిర్వహించిన సభకు 3 కిలోమీటర్ల దూరంలో పార్కింగ్ ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి కార్యకర్తలు, ప్రజలు, మహిళలు నడుచుకుంటూ సభావేదిక వద్దకు వచ్చారు. భూత్పూర్ చౌరస్తా నుంచి మహబూబ్‌నగర్ వరకు వాహనాలు రాకపోకలు నిలిపివేశారు. సభాస్థలి వద్ద నిర్మించిన 6 భారీ షెడ్లు నిండిపోయి.. రోడ్డుపై కూడా ప్రజలు నిల్చొని ప్రధాని ప్రసంగం విన్నారు.

నిఘా నీడలో పాలమూరు

- కేంద్ర బలగాలు, జిల్లా పోలీసులతో పహారా
- బందోబస్తు పర్యవేక్షించిన ఐజీ షానవాజ్ ఖాసీం



బందోబస్తు పర్యవేక్షిస్తున్న ఐజీ షానవాజ్ ఖాసీం

మహబూబ్‌నగర్ క్రైం: ప్రధాని నరేంద్రమోదీ పాలమూరు పర్యటనలో భాగంగా భూత్పూర్, పాలమూరు పూర్తిగా కేంద్ర, రాష్ట్ర బలగాల నిఘా నీడలో ఉన్నాయి. భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలో అమిస్తాపూర్ వద్ద ఆదివారం నిర్వహించిన పాలమూరు ప్రజాగర్జన కార్యక్రమానికి ప్రధాని హాజరుకావడంతో భూత్పూర్–మహబూబ్‌నగర్ రోడ్డుపై అడుగడున పోలీసులు పహారా కాశారు. ఎస్పీజీ డీఐజీ హిమన్షు గుప్తాతో మల్టీజోన్–2 ఐజీ షానవాజ్ ఖాసీం, డీఐజీ ఎల్ఎస్ చౌహన్ బందోబస్తు పర్యవేక్షించారు. అదేవిధంగా మహబూబ్‌నగర్ ఎస్పీ నరసింహతో పాటు మరో ఏడుగురు ఎస్పీలతో భద్రత పరిశీలించారు. మొత్తం 2,200 మంది పోలీస్ బలగాలతో పాటు ఎన్‌డీఆర్ఎఫ్, రాష్ట్ర ఇంటెలిజెన్స్ విభాగం అధికారులు, ఎస్పీజీ బలగాలు పాల్గొన్నాయి. అధికారిక కార్యక్రమానికి హాజరై డీజీపీ అంజనీకుమార్ బందోబస్తు వివరాలు అడిగి తెలుసుకున్నారు. భూత్పూర్ వైపు వెళ్లే ఇతర వాహనాలను పోలీసులు జడ్చర్ల మీదుగా మళ్లించారు. భూత్పూర్ వైపు నుంచి వచ్చే వాహనాలను జడ్చర్ల మీదుగా మహబూబ్‌నగర్ దారి మళ్లించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పాలమూరు రోడ్లు ట్రాఫిక్‌తో బిజీబిజీగా మారాయి.

భారీస్థాయిలో జనసమీకరణ

సభకు ఉమ్మడి జిల్లాతో పాటు రంగారెడ్డి ఇతర జిల్లాల నుంచి బీజేపీ శ్రేణులు, కార్యకర్తలు అధికంగా తరలివచ్చారు. మోదీ అధికారిక కార్యక్రమం నుంచి బహిరంగసభ వేదికపై వస్తున్న సమయంలో గిరిజన మహిళలు కాన్వాయ్ ఎదుట నృత్యం చేయగా, దారిపొడవునా కార్యకర్తలు, ప్రజలు బంతి పువ్వులను మోదీపై చల్లారు. మోదీ ప్రసంగంలో పలుమార్లు యువత మోదీ.. మోదీ.. అంటూ నినాదాలు చేయడంతో సభ స్థలం మార్మోగింది. మోదీ ప్రసంగం తెలుగులో ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్ అనువదించారు.

సంక్షేమ పాలన బీఆర్ఎస్‌తోనే సాధ్యం

- ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి



చంద్రవంచలో గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి తదితరులు

కోస్గి: అన్నివర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ పని చేస్తున్నారని.. సంక్షేమ పాలన కేవలం బీఆర్ఎస్‌తోనే సాధ్యమని ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డితో కలిసి మండలంలోని చంద్రవంచ, ముంగిమళ్ల, చెన్నారం, మీర్జాపూర్‌లో కొత్త గ్రామ పంచాయతీ భవనాలను ప్రారంభించడంతో పాటు మీర్జాపూర్, బిజ్జారం, నాచారంలో పలు అభివృద్ధి పనులు, ఆలయాల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. దేశంలోని ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలు తెలంగాణాలో అమలవుతున్నాయని, ప్రతి పల్లె అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో కొత్త పంచాయతీలను ఏర్పాటు చేయడంతో పాటు అన్ని సౌకర్యాలు కల్పిస్తూ పంచాయతీ భవనాలు నిర్మిస్తున్నామన్నారు. అధికారం కోసం మాయమాటలు చెప్పి మోసం చేసేందుకు వస్తున్న మోసగాళ్లతో అప్రమత్తంగా ఉండాలని.. కళ్ల ముందు కనిపిస్తున్న అభివృద్ధిని చూసి బీఆర్ఎస్ ప్రభుత్వానికి మరోమారు పట్టం కట్టాలని కోరారు.

రూ.కోట్ల ప్రత్యేక నిధులు..

ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతో రూ.కోట్ల ప్రత్యేక నిధులు తెచ్చి నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి అన్నారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును త్వరితగతిన పూర్తిచేసి నియోజకవర్గానికి సాగు నీరు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు వివరించారు. ఈ నెల 4న మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా కొత్త ప్రభుత్వ ఆస్పత్రి భవనాన్ని ప్రారంభించి మెరుగైన వైద్యం అందిస్తామన్నారు. అనంతరం సర్జఖాన్‌పేటలో ముదిరాజ్ భవన నిర్మాణం, ఖబ్రస్తాన్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మధుకర్‌రావు, వైస్ ఎంపీపీ సాయిలు, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ శ్యాసం రామకృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ భీంరెడ్డి, వైస్ చైర్మన్ వేణుగోపాల్, జెడ్పీటీసీ సభ్యుడు ప్రకాష్‌రెడ్డి, ఈజీఎస్ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి, పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు మ్యాకల రాజేష్, నాయకులు వెంకట నర్సింహులు, జగదీశ్వర్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలతో పాటు పలువురు పాల్గొన్నారు.

కల సాకారం..

- కృష్ణా–కాచిగూడ రైలును వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని
- ప్రజల కేరింతల నడుమ కృష్ణా నుంచి బయలుదేరిన రైలు



మక్తల్ రైల్వేస్టేషన్‌లో ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మక్తల్/కృష్ణా: నియోజకవర్గ ప్రజల కల సాకారమైంది. ఏళ్లుగా ఎదురుచూస్తున్న రైలు ప్రయాణం అందుబాటులోకి వచ్చింది. ప్రధాని నరేంద్రమోదీ ఆదివారం కృష్ణా–కాచిగూడ ప్యాసింజర్ రైలును వర్చువల్‌గా జెండా ఊపి ప్రారంభించారు. ప్రజల కేరింతల మధ్య కృష్ణా రైల్వేస్టేషన్ నుంచి ప్యాసింజర్ ట్రేన్ కదిలింది. అంతకుముందు కృష్ణా రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, గుంతకల్ రైల్వే డివిజన్ డీఆర్ఎం మనీష్ అగర్వాల్ హాజరై మాట్లాడారు. రైల్వేలైన్ ఏర్పాటుకు సహకరించిన అధికారులు, రైతులకు ధన్యవాదాలు తెలిపారు. రైలు సౌకర్యంతో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని వివరించారు.

రైలులో ప్రయాణించిన ఎమ్మెల్యే..

రైల్వే అధికారులతో కలిసి కృష్ణా నుంచి మక్తల్ వరకు ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి రైలులో ప్రయాణించారు. ఈ సందర్భంగా మాగనూర్, మక్తల్, జక్లేర్ రైల్వేస్టేషన్‌ల్లో ఎమ్మెల్యేను పలువురు సన్మానించారు. ఇక నుంచి రోజు అందుబాటులో ఉంటుందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో రైల్వే సీసీఈ జీకే గుప్తా, డీసీఎం సోమశేఖర్‌నాయుడు, డీఓఎం శ్రావణ్‌కుమార్, డీఎస్‌టీఈ యోగేంద్ర ప్రతాప్ సింగ్‌తో పాటు అధికారులు అక్కిరెడ్డి, హేమంత్ ,క్రిష్టప్ప, చౌహాన్, సీతాల్ బన్సాల్, సుదర్శన్‌రెడ్డి, జెడ్పీటీసీ వెంకటయ్య, నాయకులు మహిపాల్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, నేతాజీ రెడ్డి, ఈశ్వర్, శంషాద్దీన్, నర్సింహారెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్వోబీ నిర్మించాలని వినతి..

కృష్ణా: కృష్ణా రైల్వేస్టేషన్‌కు అటువైపు ఉన్న గురాల్ గ్రామానికి రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నామని.. ఆర్వోబీ నిర్మించాలని ఆదివారం గుంతకల్ రైల్వే డీఆర్ఎం మనీష్ అగర్వాల్‌కు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. గ్రామానికి వెళ్లేందుకు చుట్టూ తిరిగాల్సి వస్తుందని.. లేదంటే ట్రాక్‌పై నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తుందని గ్రామపంచాయతీ సభ్యుడు హన్మంతు వివరించారు. అదేవిధంగా కృష్ణా స్టేషన్‌లో ఆటోస్టాండ్ ఏర్పాటు చేయాలని ఆటోడ్రైవర్లు వినతిపత్రం అందజేశారు. ఆయా వినతులపై డీఆర్ఎం సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.


ఈల వేస్తున్న మహిళా కార్యకర్తలు




ప్రధాని మోదీకి నమస్కరిస్తున్న భూత్పూర్ మున్సిపల్ కౌన్సిలర్ తహసీన్ ఫాతిమా


సభకు హాజరైన ప్రజలు

కాషాయదళం.. కదనోత్సాహం

పాలమూరు పట్టణంతోపాటు భూత్పూర్ దారి పొడవునా కాషాయమయమైంది. అమిస్తాపూర్ ఐటీఐ కళాశాల ప్రాంగణంలో ఆదివారం ఏర్పాటు చేసిన పాలమూరు ప్రజాగర్జన బహిరంగ సభకు ప్రధాని మోదీ హాజరయ్యారు. ఈ క్రమంలో వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజలతో ప్రాంగణమంతా కిక్కిరిసిపోయింది. దారి పొడవునా పార్టీ జెండాలు పట్టుకొని కార్యకర్తలు హోరెత్తించారు. పాలమూరు ప్రజాగర్జన సభ బీజేపీ కార్యకర్తల్లో జోష్ నింపింది.

- సాక్షి నెట్‌వర్క్


బహిరంగ సభకు తరలివస్తున్న మహిళలు


కుటుంబ సమేతంగా.. బహిరంగ సభకు


ప్రధాని నరేంద్రమోదీకి స్వాగతం పలుకుతున్న గిరిజన మహిళలు



బీజేపీ జెండాతో ఓ కార్యకర్త

ప్రధాని మోదీకి జ్ఞాపికలు బహూకరిస్తున్న కిషన్‌రెడ్డి, డీకే అరుణ






సభా వేదిక వద్ద జిల్లా నేతలు ఏపీ జితేందర్‌రెడ్డి తదితరులు


కమలం పువ్వు గుర్తుతో మహిళా కార్యకర్త జోష్

క్లుప్తంగా

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య


నర్సింహులు (ఫైల్)

మానవపాడు: అప్పుల బాధ భరించ లేక పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం మండలంలోని గోకులపాడులో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాము తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గోకులపాడుకు చెందిన కుమ్మరి నర్సింహులు (34) గతేడాది కొత్త ఇల్లు కట్టుకున్నాడు. దీంతో అప్పులు ఎక్కువగా కావడంతో బాధ భరించలేక గత నెల 27వ తేదీన పురుగుల మందు తాగాడు. చికిత్స నిమిత్తం కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆదివారం ఉదయం చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చెరువులో పడి బాలుడి మృతి

కోస్గి: ఆడుకుంటూ వెళ్లి చెరువులో పడి బాలుడు మృతి చెందిన ఘటన ఆదివారం మండల పరిధిలో చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.. మీర్జాపూర్‌కు చెందిన క్రిష్ణయ్య, చంద్రమ్మల కుమారుడు కార్తీక్(8) అదే గ్రామంలోని పాఠశాలలో 3వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం పాఠశాలకు సెలవు కావడంతో స్నేహితులతో కలిసి టైర్‌లతో ఆడుకుంటూ గ్రామ శివారులోని బొల్లకుంట సమీపంలోకి వెళ్లాడు. అలుగు దగ్గర ఆడుకుంటున్న క్రమంలో టైర్ చెరువులో పడింది. తీసుకునేందుకు చెరువులోకి వెళ్లగా మునిగిపోయాడు. దీన్ని గమనించిన తోటి స్నేహితులు ఊరిలోకి వెళ్లి కుటుంబసభ్యులను తీసుకొచ్చే లోపు బాలుడు కనిపించలేదు. చెరువులో బాలుడి కోసం వెతకగా చెరువు అలుగు గుంతలో మృతదేహం కనిపించింది. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ధ్వంసమైన చెక్‌డ్యాంలు

- వాటర్‌షెడ్ పథకంలో నిర్మాణం
- మరమ్మతు చేపడితే ప్రయోజనం

జడ్చర్ల: పరుగెత్తే వర్షం నీటిని ఆపి భూగర్భంలోకి ఇంకే విధంగా చేపట్టిన చెక్‌డ్యాంలు ఆనవాళ్లు కోల్పోయాయి. ఎక్కడికక్కడ తెగిపోవడం, శిథిలావస్థకు చేసుకోవడంతో లక్ష్యం దెబ్బతింది. రూ.లక్షల వెచ్చించి వ్యవసాయ పొలాల్లో నిర్మించిన చెక్‌డ్యాంలు నేడు జాడలేకుండా పోయాయి.

వాటర్ షెడ్ పథకంలో..

రెండు దశాబ్దాల కిందట కరువు జిల్లాగా ఖ్యాతికెక్కిన పాలమూరులో భూగర్భజలాల పెంపుతో పాటు పంటపొలాల రక్షణ, ఉపాధి తదితర లక్ష్యాల సాధనకు ఉద్దేశించి వాటర్ షెడ్ పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేశాయి. ఈ పథకం అమలులో భాగంగా బీడు భూములను సస్యశ్యామలం చేసేలా వాలుకట్టలు, రాతి కట్టలు, ఊటకుంటల నిర్మాణంతో పాటు చెక్‌డ్యాంలను నిర్మించారు.

కనుమరుగవుతున్న వైనం..

కాలక్రమేణా వర్షాలు సమృద్ధిగా కురిసి భూగర్భజలాలు పెరగడంతో చెక్‌డ్యాంల ప్రయోజనానికి ప్రభుత్వం అంతగా ప్రాధాన్యతను ఇవ్వలేకపోయింది. గతంలో నిర్మించిన వాటిని కూడా పట్టించుకోకపోవడంతో ఎక్కడికక్కడ దెబ్బతిన్నాయి. కొన్ని తెగిపోవడం, మరికొన్ని ధ్వంసం కావడంతో ఆనవాళ్లు కోల్పోయాయి. రియల్ వ్యాపారంలో భూములను ఎక్కడికక్కడ చదును చేయడంతో అడ్డంకిగా ఉన్న చెక్‌డ్యాంలను సంబంధిత భూ యజమానులు తొలగించారు.


అయ్యవారిపల్లి శివారులో తెగిపోయిన చెక్‌డ్యాం

నియోజకవర్గంలో..

నియోజకవర్గంలోని జడ్చర్ల, మిడ్జిల్, బాలానగర్, రాజాపూర్, నవాబుపేట, ఊర్కొండ మండలాల్లో పెద్ద ఎత్తున చెక్‌డ్యాంలు నిర్మించారు. దుందుబీ వాగుపై భారీగా చెక్‌డ్యాంల నిర్మాణం చేపట్టారు. తదుపరి వాటిపై సరైన పర్యవేక్షణ లేకపోవడంతో లక్ష్యం ముందుకు సాగడం లేదు. మిడ్జిల్ మండలంలో దుందుబీ వాగుపై వాడ్యాల శివారులో నిర్మించిన చెక్‌డ్యాం వరద ప్రవాహానికి కొట్టుకుపోయింది. ఇప్పటి వరకు దీని మరమ్మతులు చేపట్టకపోవడంతో, తమ పంట పొలాలు కోతకు గురవుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


వాడ్యాల్ శివారులో దుందుబీ వాగుపై నిర్మించిన చెక్‌డ్యాం పరిస్థితి

ఇప్పటికైనా నీటిపారుదల శాఖ అధికారులు స్పందించి చెక్‌డ్యాంల మరమ్మతులపై దృష్టి సారించి ప్రయోజనంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.


కరీంనగర్‌లోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో రెండు రోజులుగా నిర్వహించిన 9వ రాష్ట్రస్థాయి జూనియర్స్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో అండర్-20 మహిళల విభాగంలో నాగర్‌కర్నూల్ జిల్లా క్రీడాకారిణులు చాంపియన్‌షిప్‌ను కైవసం కోగా.. రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ ట్రోఫీ అందజేశారు.

భారీ జాతీయజెండా ఆవిష్కరణ

కల్వకుర్తి టౌన్: మున్సిపాలిటీలో నూతనంగా కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన భారీ జాతీయ జెండాను ఆదివారం మున్సిపల్ చైర్మన్ సత్యంతో కలిసి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ప్రారంభించారు. 100 అడుగుల ఎత్తులో ఉన్న జాతీయజెండాను ప్రతినిత్యం ఎగిరేలా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ షాహెద్, కౌన్సిలర్లు, కమిషనర్ ఆశ్రిత్ కుమార్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.


భారీ జాతీయజెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, కౌన్సిలర్లు

సంతానం కలగలేదని వివాహిత బలవన్మరణం

మక్తల్: వివాహమై నాలుగేళ్లు గడిచినా సంతానం కలగడం లేదని వివాహిత బలవన్మరణానికి పాల్పడిన ఘటన మండలంలోని ఖానాపూర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. కృష్ణ మండలం గుడేబల్లూర్ చెందిన దేవప్ప కూతురు లక్ష్మి మక్తల్ మండలం ఖానాపూర్ చెందిన మారుతితో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. 20 రోజుల క్రితం లక్ష్మికి గొంతులో విపరీతంగా నొప్పి కావడంతో ఆపరేషన్ చేయించుకుని పుట్టింటికి వెళ్లింది. అనంతరం తమ్ముడు రమేష్‌తో కలిసి ఖానాపూర్‌కు వచ్చింది. వివాహమై నాలుగేళ్లు గడిచినా పిల్లలు కావడంతో శనివారం లక్ష్మి ఇంట్లో పురుగుల మందు తాగిందని తండ్రి తెలిపారు. వెంటనే ఆమెను మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మహబూబ్‌నగర్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ విషయంపై మక్తల్ పోలీసులకు సమాచారం అందించారు. మృతురాలు తండ్రి దేవప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పర్వతాలు తెలిపారు.

నో ప్లాస్టిక్‌పై అవగాహన

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: మేరీ మట్టి మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని పిల్లలమర్రి వద్ద నో ప్లాస్టిక్, స్వచ్ఛభారత్ కార్యక్రమాలపై ఎన్‌సీసీ క్యాడెట్‌లు ప్రజలకు అవగాహన కల్పించారు. తెలంగాణ బెటాలియన్ కల్నల్ సుదీప్‌కుమార్‌సింగ్ మాట్లాడుతూ సమాజం బాగుండాలంటే ప్రతి ఒక్కరు స్వచ్ఛతా, శుభ్రత పాటించాలన్నారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛతపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో మేజర్ జర్నైల్‌సింగ్, వీందర్‌సింగ్, రాజేష్, మన్‌దీప్, రంజిత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కార్యక్రమంలో ఎన్‌సీసీ క్యాడెట్‌లు, అధికారులు

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

హన్వాడ: మండలంలోని పల్లెమోనికాలనీకి చెందిన గొల్ల నారాయణ(60) గత నెల 23న రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పల్లెమోనికాలనీకి చెందిన గొల్లనారాయణ సరుకులు కొనుగోలు కోసం మహబూబ్‌నగర్ వచ్చాడు. పల్లెమోనికాలనీలో తమ ఇంటికి వెళ్లే క్రమంలో హన్వాడ నుంచి ప్రయాణికులతో రవి తన ఆటోను అజాగ్రత్తగా నడుపుతూ గొల్లనారాయణను ఢీకొట్టాడు. దీంతో తీవ్రగాయాల పాలైన అతన్ని చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లగా, అటు నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ ఆదివారం ఆయన మృతి చెందాడు. మండలంలోని పూజారితండాకు చెందిన ఆటో డ్రైవర్ రవిపై కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ రవినాయక్ తెలిపారు.

జానంపేటలో..

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలం జానంపేటకు చెందిన లక్ష్మయ్య (49) ఆదివారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ వెంకటస్వామి తెలిపారు. గతనెల 28న పురుగులమందు తాగిన అతడిని కుటుంబ సభ్యులు హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతుడి కుమారుడు సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆదివారం ఉదయం రాజ్‌భవన్ ప్రాంగణంలో శ్రమదానం చేశారు. రాజ్‌భవన్‌లోని పారిశుద్ధ్య సిబ్బందితో కలిసి పిచ్చి మొక్కలు, వ్యర్థాలను తొలగించారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన స్వచ్ఛ భారత్ కార్యక్రమానికి స్పందనగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

నేడు శిల్పకళా వేదికగా 'మంథన్-2023'

సాక్షి, హైదరాబాద్: ప్రతీ ఏడాది అక్టోబర్ 2న నగరం వేదికగా నిర్వహించే 'మంథన్-2023' కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని నిర్వాహకులు తెలిపారు. మంథన్ సంవాద్ ఆధ్వర్యంలోని ఈ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నగరంలోని శిల్పకళా వేదికగా నిర్వహించనున్నామని వెల్లడించారు. ఈ ఏడాది చర్చా కార్యక్రమాల్లో ఒడిశా హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఎస్.మురళీధర్, న్యూఢిల్లీ పాలసీ రీసెర్చ్ సెంటర్ ప్రెసిడెంట్ యామిని అయ్యర్ తదితరులు పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఐటీ హబ్‌గా విశాఖ

- వచ్చే ఐదేళ్లలో 5 లక్షల ఉద్యోగాల కల్పనకు అవకాశం
- ఒక్క ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లోనే 50,000 ఉద్యోగాలు వైజాగ్‌లో..
- రాష్ట్రవ్యాప్తంగా వచ్చే ఐదేళ్లలో 10 లక్షల ఉద్యోగాలు
- ఏటా 3.5 లక్షల మంది తాజా గ్రాడ్యుయేట్స్ వస్తుండటమే రాష్ట్ర బలం
- పల్సస్ గ్రూపు అధ్యయన నివేదికలో వెల్లడి



సాక్షి, అమరావతి: రానున్న కాలంలో విశాఖ నగరం ఐటీ ఉద్యోగాలకు కేంద్రంగా మారనుంది. ఈ రంగంలో కొత్తగా కెరీర్ ప్రారంభించే వారికి అది అవకాశాల గని కానుంది. ముఖ్యంగా ఐటీ, ఐటీ ఆధారిత రంగంలో ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరగనున్నాయి. వచ్చే ఐదేళ్ల కాలంలో ఐటీ రంగంలో ఒక్క విశాఖపట్నంలోనే ఐదులక్షలకు పైగా ఉపాధి అవకాశాలు వస్తాయని పల్సస్ గ్రూపు తన అధ్యయన నివేదికలో వెల్లడించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విశాఖపట్టణాన్ని పరిపాలన రాజధానిగా ప్రకటించడంతో పాటు ఇక్కడ ఉపాధి అవకాశాలపై అంతర్జాతీయంగా ప్రాచుర్యం కల్పించడంతో ఐటీ హబ్‌గా విశాఖ వేగంగా ఎదుగుతోందని పల్సస్ గ్రూపు సీఈఓ శ్రీనుబాబు గేదెల తెలిపారు. ఇప్పటికే ఇన్ఫోసిస్, రాండ్‌స్టాండ్, అమెజాన్, అదానీ డేటాసెంటర్ వంటివి రావడంతో పాటు ఆంధ్రయూనివర్సిటీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ, పారిశ్రామిక రంగంలో నాలుగో తరం టెక్నాలజీని ప్రోత్సహించేందుకు కల్పతరువు పేరుతో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీలు ఇక్కడ ఏర్పాటుకావడంతో అంతులేని ఉపాధి అవకాశాల నిధిగా విశాఖ ఎదుగుతోందన్నారు. ఈ ఏడాది భారతదేశం జీ20 సమావేశాలకు వేదికగా ఎంపిక కావడంతో ఆ అవకాశాన్ని చక్కగా వినియోగించుకుని ఫార్మాస్యూటికల్, హెల్త్‌కేర్, ఐటీ, ఐటీ ఆధారిత సేవల్లో విశాఖపట్నానికి ఉన్న అవకాశాలు, అందుబాటులో ఉన్న మానవ వనరులను ప్రపంచ దేశాలకు వివరించినట్లు తెలిపారు. రాష్ట్రం నుంచి ఏటా మూడు లక్షలకు పైగా విద్యార్థులు డిగ్రీ పట్టాలను అందుకుంటుంటే అందులో ఒక్క విశాఖ చుట్టుపక్కల నుంచే 1.5 లక్షల మంది వస్తున్నారు. ఉపాధి అవకాశాలు కల్పించడంలో విశాఖకు ఇది కలిసొచ్చే అతిపెద్ద అంశమని ఆ నివేదికలో పేర్కొన్నారు.

వచ్చే ఐదేళ్లలో కొలువుల పండుగ..

ఇక రాష్ట్రవ్యాప్తంగా వచ్చే ఐదేళ్లలో 10 లక్షల ఉద్యోగాలు రానుండగా అందులో ఒక్క విశాఖలోనే 5 లక్షల ఉద్యోగాలు రానున్నట్లు పల్సస్ గ్రూపు అంచనా వేసింది. ఇందులో ఒక్క ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలోనే విశాఖలో 50,000 ఉద్యోగాలు వస్తాయని ఆ నివేదిక పేర్కొంది. ప్రస్తుతం విశాఖలోని ఐటీ రంగం 25,000 మందికి ఉపాధి కల్పిస్తుంటే హెల్త్‌కేర్, ఫార్మా, మెరైన్ ఇండస్ట్రీస్, పర్యాటకం, రక్షణ, విద్య వంటి రంగాలు లక్ష మందికి పైగా ఉపాధి కల్పిస్తున్నాయి. ఈ సంఖ్య ఐదేళ్లలో ఐదు లక్షలకు చేరుతుందని శ్రీనుబాబు వివరించారు.

శ్రీవారిని దర్శించుకున్న న్యాయమూర్తులు



శ్రీవారి ఆలయం ఎదుట సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దీపాంకర్ దత్తా



సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బేలా ఎం.త్రివేది



ఏపీ హైకోర్టు జస్టిస్ జైసూర్య, జస్టిస్ రవినాథ్ తిలహరి, అలహాబాద్ హైకోర్టు జస్టిస్ సంగీత చంద్ర



తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నామవరపు రాజేశ్వర్ రావు

తిరుమల: తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, వివిధ హైకోర్టుల న్యాయమూర్తులు దర్శించుకున్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బేలా ఎం.త్రివేది, జస్టిస్ దీపాంకర్ దత్తా, ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జైసూర్య, జస్టిస్ రవినాథ్ తిలహరి, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు, అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంగీత చంద్ర స్వామివారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా, అధికారులు లడ్డూ ప్రసాదాలు అందించి సత్కరించారు.

ఓపీఎస్ అమలు చేయాల్సిందే

రాంలీలా మైదాన్ సభలో ఎన్‌ఎంఓపీఎస్ సెక్రటరీ జనరల్ స్థితప్రజ్ఞ



ఆదివారం ఢిల్లీలోని రాంలీలా మైదానంలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతున్న స్థితప్రజ్ఞ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో పని చేస్తున్న ఉద్యోగులకు పాత పింఛను విధానాన్ని అమలు చేయాలని నేషనల్ మూవ్‌మెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీం (ఎన్‌ఎంఓపీఎస్) సెక్రటరీ జనరల్ గంగాపురం స్థితప్రజ్ఞ డిమాండ్ చేశారు. సీపీఎస్ నుంచి విరమించుకోవాలనుకునే రాష్ట్రాలకు ఆ అవకాశం ఇచ్చి రాష్ట్రాల స్వేచ్ఛను కాపాడేవిధంగా సమాఖ్య స్ఫూర్తిని చాటుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం ఢిల్లీలోని రాంలీలా మైదానంలో వివిధ రాష్ట్రాల ప్రభుత్వ ఉద్యోగులతో భారీ బహిరంగ సభను నిర్వహించారు. జాతీయ కిసాన్ సంఘ్ నాయకుడు రాకేశ్ టికాయత్‌తో పాటు పలు రాష్ట్రాలకు చెందిన ఉద్యోగ సంఘాల నేతలు హాజరైన ఈ సభలో స్థితప్రజ్ఞ మాట్లాడుతూ...ఉద్యోగుల ప్రయోజనాలను ఫణంగా పెట్టి వాటిని కార్పొరేట్లకు కట్టబెట్టే విధంగా సీపీఎస్ విధానాన్ని అమలు చేస్తున్నారన్నారు. ఈ విధానాన్ని రద్దు చేసుకుంటున్న రాష్ట్రాలకు పెన్షన్ నిధి ఇవ్వకపోవడం సమాఖ్య స్ఫూర్తికి విఘాతం కలిగించడమేనని దుయ్యబట్టారు. సీపీఎస్ కారణంగా రిటైర్ అయిన ఉద్యోగులు కేవలం నెలకు రూ.1,200–1,800 పింఛను పొందుతున్నారని, తద్వారా జీవనోపాధితో పాటు సామాజిక భద్రతను కూడా కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ భద్రతలో కీలకపాత్ర పోషించే పారామిలటరీ బలగాలకు కూడా పాత పింఛను విధానాన్ని నిరాకరించడం దారుణమని, వెంటనే అన్ని రాష్ట్రాల్లోని ప్రభుత్వ ఉద్యోగులకు ఓపీఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సభకు విజయ్‌కుమార్ (ఉత్తరప్రదేశ్), సుఖ్జీత్ సింగ్ (పంజాబ్), కల్వల శ్రీకాంత్, నరేశ్‌గౌడ్ (తెలంగాణ), వితేశ్ కండేల్కర్ (మహారాష్ట్ర), దారివాల్ (హరియాణ), ప్రదీప్ ఠాకూర్ (హిమాచల్ ప్రదేశ్), శాంతారం (కర్ణాటక)లతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులు, రైల్వే, అటానమస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు హాజరయ్యారు.

సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధమా?

- నారా లోకేశ్‌కు మాజీ మంత్రి పేర్ని నాని సవాల్
- మీ బాబు అన్నం తిని కాదు.. స్టేలు తెచ్చుకుని బతుకుతోంది వాస్తవం కాదా?



సాక్షి, అమరావతి: చంద్రబాబు అవినీతిపై సిట్టింగ్ జడ్జితో విచారణకు ఆయన తనయుడు నారా లోకేశ్ సిద్ధమా అని మాజీ మంత్రి పేర్ని నాని సవాల్ విసిరారు. చంద్రబాబు అన్నం తిని కాకుండా.. స్టేలు తెచ్చుకుని బతుకుతోంది వాస్తవం కాదా అని నిలదీశారు. అవినీతి కేసుల్లో విచారణ జరిగితే ఆయనకు యావజ్జీవ కారాగార శిక్ష పడటం ఖాయమన్నారు. విచారణకు సిద్ధంగా లేకుంటే నొక్కేసిన ప్రజాధనాన్ని ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలని సూచించారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం పేర్ని నాని మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు అవినీతికి పాల్పడ్డాడని ప్రజలే కాదు.. టీడీపీ కార్యకర్తలు కూడా విశ్వసిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఆత్మావలోకనం చేసుకోకుండా చంద్రబాబుపై అక్రమ కేసులు పెడుతున్నారని నారా లోకేశ్‌తోపాటు టీడీపీ నేతలు తెగ గగ్గోలు పెడుతున్నారని పేర్నినాని మండిపడ్డారు. బాబు అవినీతిపరుడు కాదు సచ్ఛీలుడని ఆయన కుటుంబం నమ్మితే 1995లో ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధమా అని సవాల్ విసిరారు.

జూబ్లీహిల్స్ కొంప ఎవరు కట్టారు లోకేశ్?

హైదరాబాద్‌లో జూబ్లీహిల్స్, మాదాపూర్ ఇళ్లు, ఎన్టీఆర్ ట్రస్టు భవనం, ఉండవల్లి కరకట్ట, మంగళగిరిలో పార్టీ కొంపలు ఎవరు కట్టారో చెప్పాలని లోకేశ్‌ను నిలదీశారు. కరకట్ట నివాసం ప్రభుత్వానిదని స్వయంగా చంద్రబాబే చెప్పారు. మరి ఓడిపోగానే ప్రభుత్వానికి ఎందుకు అప్పగించలేదని ప్రశ్నించారు. జనం సొమ్ము దోచుకున్నాడని బాబును అరెస్టు చేస్తే మాత్రం గంటలు మోగించాలా అని నిలదీశారు. మరోవైపు పవన్ కళ్యాణ్ లక్ష్యం చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడమేనన్నారు. 2019లో ఇదే పవన్.. చంద్రబాబు వెధవ, లుచ్చా అని, ప్రజల డబ్బు దోచేశాడని ప్రచారం చేశారని గుర్తు చేశారు. కాపులు ఎక్కువగా ఉన్న నియోజకవర్గాల్లోనే పవన్ పర్యటిస్తున్నారని.. వారిని తాకట్టు పెడతావని కాపులకు తెలియదనుకుంటున్నావా అని మండిపడ్డారు. హరీశ్ రావు చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ మాట్లాడుతున్నారని.. చంద్రబాబు చేతిలో ఎన్టీఆర్‌కి అయినట్టే, హరీశ్ రావు చేతిలో కేసీఆర్‌కు కూడా అదే జరగొచ్చన్నారు.

పప్పుధాన్యాల ఉత్పత్తి తగ్గింది



శనగ పప్పు పంపిణీ వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

- పప్పుల ఉత్పత్తి పెంపునకు కృషి చేయాలి
- ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది
- రాయితీపై శనగ పప్పు పంపిణీ మంచి నిర్ణయం
- వినియోగదారులకు మేలు చేసేలా హాకా నిర్ణయం
- 'భారత్ దాల్' ఆవిష్కరణలో మంత్రి నిరంజన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: దేశంలో పప్పుల వినియోగం పెరిగిందని..అదే సమయంలో ఉత్పత్తి భారీగా తగ్గిపోయిందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. దీంతో దేశ అవసరాలకు ఇతర దేశాల నుంచి పప్పులు దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. ఈ నేపథ్యంలో దేశంలో పప్పుల ఉత్పత్తి పెంచేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరముందన్నారు. రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థ హాకా 'భారత్ దాల్' పేరుతో పంపిణీ చేస్తున్న రాయితీ శనగపప్పు కార్యక్రమాన్ని ఆదివారం హెచ్ఐసీసీలో కేంద్ర వినియోగదారులశాఖ కార్యదర్శి రోహిత్‌కుమార్ సింగ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ విదేశాల నుంచి కందిపప్పును పెద్ద ఎత్తున దిగుమతి చేసుకుంటున్నామన్నారు. కంది పండిస్తే మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో భారత్‌దాల్ పేరుతో హాకా చేస్తున్న కార్యక్రమం ప్రశంసనీయమన్నారు. మధ్యతరగతి, పేద వినియోగదారులకు ఇది ఎంతో మేలు చేస్తుందన్నారు. బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.90 ఉన్న శనగపప్పును రూ.60కే అందించడంపై అభినందనీయమని తెలిపారు. కేంద్ర వినియోగదారులశాఖ కార్యదర్శి రోహిత్‌కుమార్‌సింగ్ మాట్లాడుతూ రాయితీ శనగ పప్పు పంపిణీకి సంబంధించి తొలుత తమ జాబితాలో హాకా లేదన్నారు. అయితే హాకా చైర్మన్ మచ్చా శ్రీనివాస్‌రావు తన వద్దకు పలుమార్లు వచ్చి హాకా గొప్పతనాన్ని, తెలంగాణ ప్రభుత్వ మద్దతు వివరించారని తెలిపారు. ఒక అవకాశం ఇచ్చి చూద్దామని హాకాకు శనగల పంపిణీ బాధ్యత అప్పగించామన్నారు. హాకా పనితీరు, ఏర్పాట్లు చూశాకా మరింత నమ్మకం పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో హాకా చైర్మన్ మచ్చా శ్రీనివాసరావు, వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, హాకా ఎండీ సురేందర్, జీఎం రాజ మోహన్, ఆగ్రోస్ ఎండి కె.రాములు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, మాజీమంత్రికి వ్యతిరేకంగా పోస్టర్లు



కొల్లాపూర్: ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి, మాజీమంత్రి జూపల్లి కృష్ణారావుకు వ్యతిరేకంగా కొల్లాపూర్‌లో పోస్టర్లు వెలిశాయి. పట్టణంలోని 16వ వార్డు ఏరియాలో ఈ పోస్టర్లను గుర్తుతెలియని వ్యక్తులు గోడలపై అంటించారు. రెండుసార్లు మంత్రి పదవి అనుభవించిన జూపల్లి కొల్లాపూర్‌ను కొల్లగొట్టిండు.. బీరాలు పలికిన బీరం ప్రజలను మోసం చేసిండు.. కొల్లాపూర్ విలన్లు వీరు అంటూ పోస్టర్లలో పేర్కొన్నారు. ఈ ఒక్క ప్రాంతంలో మాత్రమే పోస్టర్లు కనిపించాయి. అయితే వీటిని ఎవరు అంటించారనేది తెలియరాలేదు.

జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



మహబూబ్‌నగర్ క్రీడలు: రాజస్థాన్‌లోని జైపూర్‌లో సోమవారం నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయస్థాయి జూనియర్ ఫుట్‌బాల్ పోటీలకు జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఎదిరకు చెందిన అంకిత, మక్తల్‌కు చెందిన నందిని పోటీలకు ఎంపికైనట్లు ఫుట్‌బాల్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్పీ వెంకటేశ్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. వీరి ఎంపికపై ఫుట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. జాతీయస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచాలని సూచించారు.

రైతులను కాటేస్తున్న కాలుష్యం



పోలేపల్లి సెజ్‌లోని ఓ పరిశ్రమ నుంచి రైతుల పొలాల్లోకి వదులుతున్న కాలుష్య జలాలు

- ఎన్జీటీ జరిమానా వేసినా తీరు మార్చుకోని పరిశ్రమల యాజమాన్యాలు
- వర్షం సాకుతో రైతుల పొలాల్లోకి కాలుష్యపు జలాలు
- పంటలు పండించుకోలేని దుస్థితి



రైతుల పొలాల్లో కాలుష్య నీరు

రాజాపూర్: ఆరుగాలం శ్రమించి పంటలు పండించుకునే రైతుల పొలాల్లోకి పక్కన ఉన్న పరిశ్రమల నుంచి విషపు జలాలను వదులుతూ వారి జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు. వాయు, జల కాలుష్యంతో పాటు కొన్నేళ్ల నుంచి ఈ కాలుష్యంపై మండలంలోని రాయపల్లి, ముదిరెడ్డిపల్లి రైతులు ఆందోళనలు చేస్తూనే ఉన్నారు. పరిశ్రమల వారు కాలుష్యపు జలాలను వదులుతూనే ఉన్నారు. కొన్ని నెలల క్రితం 'సాక్షి' దినపత్రిలో వరుస కథనాలు ప్రచురణ కావడంతో అప్పటి కలెక్టర్ వెంకట్రావ్ కమిటీని వేసి వాస్తవాలను వెలికితీయాలని ఆదేశించారు. కమిటీ చైర్మన్ ఆర్డీఓ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో భూగర్భ జల శాఖ, వైద్య, ఆరోగ్యశాఖ, వ్యవసాయశాఖ, మత్స్యశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేసి కాలుష్యం వదులుతుండటంతో పంటలు పండవని, సేద్యానికి ఆమోదయోగ్యం కావని, ప్రజలు కాలుష్యం కారణంగా రోగాల బారిన పడుతున్నారని నివేదికలు తయారు చేసి ఉన్నతాధికారులకు అందజేశారు.

హైకోర్టుకు నివేదికలు అందజేస్తున్నాం

రైతులు తమ పొలాల్లోకి కాలుష్యం నీరు వదులుతున్నారని ఫిర్యాదు చేశారు. దీంతో క్షేత్రస్థాయిలో విచారణ చేశాం. కొన్ని శాంపిళ్లు సేకరించి ల్యాబ్‌కు పంపించాం. రిపోర్టులు వచ్చిన వెంటనే హైకోర్టులో తమ లీగల్ టీం నివేదికలు అందజేస్తారు.

– కృపానంద్, జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్

క్రిమినల్ కేసులు నమోదు చేయాలి



మా పొలాల్లోకి కాలుష్యపు జలాలు వదిలి పంటలు పండకుండా చేసి, పశువుల మృతికి కారకులైన కంపెనీల యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. కాలుష్యమైన మా భూములను తిరిగి సారవంతంగా తయారు చేసి ఇవ్వాలి. కోర్టులు జరిమానా వేసినా ఫార్మ పరిశ్రమల బుద్ధి మారదు. మాగ్రామ శివారులో ఉన్న పల్లె చెరువులో కాలుష్య జలాలు వదలటంతో మత్స్యకారులు వదిలిన చేపలు సైతం చనిపోతున్నాయి. మత్స్యశాఖ అధికారులు చెరువులోని నీటిని పరీక్షించారు. చేపలు మృతి చెందడానికి కాలుష్య నీరే కారణమంటూ నివేదికలు ఇచ్చారు.

– శేఖర్‌గౌడ్, రైతు, ముదిరెడ్డిపల్లి

భూమి అమ్ముదామన్నా కొనేవాళ్లు లేరు



పరిశ్రమలు వస్తే తమ పిల్లలకు ఉపాధి దొరుకుతుందని అనుకున్నాం. ఈ కాలుష్య కంపెనీ పరంగా మేము ఊరు వదిలి వెళ్లే పరిస్థితి వచ్చింది. ఉన్న భూములు పరిశ్రమలు వదిలే కాలుష్యం కారణంగా పంటలు పండటంలేదు. పొలం ఎవరికైనా అమ్ముదామంటే కాలుష్యం వల్ల కొనేవాళ్లు లేరు. మా బాధలు ఎవరికి చెప్పుకోవాలి.

– విఠలయ్యగౌడ్, రైతు, రాయపల్లి

బీఆర్ఎస్ బలోపేతానికి ఎంతో కృషి చేశాం



మాట్లాడుతున్న మందా జగన్నాథం

ఎర్రవల్లి చౌరస్తా: బీఆర్ఎస్ పార్టీ అలంపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టికెట్‌ను మందా శ్రీనాథ్‌కు కేటాయించాలని ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి మందా జగన్నాథం అన్నారు. ఆదివారం ఇటిక్యాల మండలం కొండేరులోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దశాబ్దాలుగా బీఆర్ఎస్‌ను నమ్ముకొని పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం కృషిచేసిన తమకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. అలంపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఉనికి అంతంత మాత్రంగా ఉన్నప్పుడు సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు పార్టీ బాధ్యతలు స్వీకరించి.. బలోపేతానికి ఎంతో కృషి చేశామన్నారు. ఒకనాడు జై తెలంగాణ అనని వారికి టికెట్ కేటాయించారన్నారు. ఓడిపోయే పరిస్థితుల్లో తమకు టికెట్ కేటాయించి గెలిచే పరిస్థితుల్లో తమకు టికెట్ ఇవ్వలేదని వాపోయారు. గత ఎన్నికల్లో తనకు ఎంపీ టికెట్, శ్రీనాథ్‌కు ఎమ్మెల్యే సీటు ఇస్తామని చెప్పి చివరికి ప్రత్యామ్నాయం చూపిస్తామని బుజ్జగించి నిరాశకు గురిచేశారన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఆంధ్ర ఎంపీలను ఎదుర్కొని లోక్‌సభలో రాష్ట్ర బిల్లు ఆమోదం పొందడానికి ఎంతో పోరాటం చేశానన్నారు. పార్టీ కోసం శ్రమ పడింది.. ఒకరైతే ఫలితం మరొకరిదా అని ఆవేదన వ్యక్తం చేశారు. అధిష్టానం వద్ద ఎన్నిసార్లు తన బాధను విన్నవించినా నచ్చజెప్పాలని చూస్తున్నారే తప్ప న్యాయం చేయడం లేదని వాపోయారు. ప్రస్తుతం నియోజకవర్గంలో ఒక వ్యక్తి చేతిలో అధికారం కేంద్రీకృతమై ఉందని, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మధ్యస్థాయి నాయకులు ముఖ్యమైన కార్యకర్తలకు ఎలాంటి ప్రాధాన్యత లేదన్నారు. నియోజకవర్గంలో ప్రస్తుతం పార్టీ కకావికలం అయ్యే పరిస్థితులు నెలకొన్నాయని ఆరోపించారు. పార్టీ ప్రకటించిన అభ్యర్థిపై ప్రతి మండలంలో నిరసనలు, ధర్నాలు, వ్యతిరేక సమావేశాలు జరుగుతున్నాయని, ఇలాంటి పరిస్థితుల్లో సదరు అభ్యర్థి గెలవడం కష్టమన్నారు. ఇప్పటికైనా అధిష్టానం పార్టీ నిర్మాణంలో పాలు పంచుకున్న వారిని గుర్తించి న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు మందా శ్రీనాథ్, రామిరెడ్డి, వీరన్న, అంజి, బషీర్‌మియ్యా తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా మినిస్టర్ కప్ కరాటే చాంపియన్‌షిప్

500 మందికిపైగా విద్యార్థుల హాజరు



విద్యార్థులకు గ్రాండ్‌చాంపియన్‌షిప్ అందజేస్తున్న మాస్టర్లు

మహబూబ్‌నగర్ క్రీడలు: ఆర్‌కే స్పోర్ట్స్ కరాటేడూ మార్షల్ ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం నిర్వహించిన మినిస్టర్ కప్ ఆల్‌స్టైల్ ఓపెన్ రాష్ట్రస్థాయి కరాటే చాంపియన్‌షిప్ ఉత్సాహంగా సాగింది. పోటీల్లో ఉమ్మడి జిల్లాతోపాటు ఇతర జిల్లాల నుంచి దాదాపు 500 మంది కరాటే విద్యార్థులు పాల్గొన్నారు. కుమితే, కటా, టీమ్ కటాస్, వెపన్ కటాస్ విభాగాల్లో సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ కేటగిరీల్లో పోటీలు నిర్వహించారు. పోటీలను ఆర్‌కే స్పోర్ట్స్ కరాటేడూ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ వైస్ చైర్మన్ కిన్నెర శేఖర్, ప్రముఖ కవి రఘువీర్‌ప్రతాప్ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు మార్షల్ ఆర్ట్స్‌లో ప్రతిభ చాటాలని పిలుపునిచ్చారు. కరాటే మార్షల్ ఆర్ట్స్‌తో దేహదారుఢ్యంతోపాటు మానసికంగా ఎదగవచ్చని అన్నారు. అనంతరం వారు పలువురు విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. అండర్–12 పైబడి విభాగంలో తనుశ్రీ, అఖిలేష్‌కుమార్, అండర్–12 విభాగంలో అచ్యుత్, బ్లాక్‌బెల్టు సీనియర్ బాలికలో యామిని, బాలురలో జయదీప్‌సింగ్, బ్రౌన్ బెల్టులో కావ్యశ్రీ, అండర్–8 విభాగంలో అగస్త్య సాయి గ్రాండ్‌చాంపియన్‌షిప్ సాధించారు. కార్యక్రమంలో రవికుమార్, రవీందర్‌కుమార్, ప్రశాంత్, విజయ్‌కుమార్, శాంత, మాస్టర్లు క్రిష్ణయ్య, తాజుద్దీన్, కనకంయాదవ్, రవినాయక్ పాల్గొన్నారు.

శరన్నవరాత్రి వాల్‌పోస్టర్ల విడుదల



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పాలకమండలి చైర్మన్, ఈఓ, ధర్మకర్తలు

జోగుళాంబశక్తిపీఠం: ఈనెల 15 నుంచి ప్రారంభం కానున్న అలంపూర్ జోగుళాంబ అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాల వాల్ పోస్టర్‌లను ఆలయ చైర్మన్ చిన్న కృష్ణయ్య, ఈఓ పురేందర్ కుమార్, ధర్మకర్తల మండలి సభ్యులు ఆదివారం ఆవిష్కరించారు. అంతకుముందు వారు బాల బ్రహ్మేశ్వర స్వామి, జోగుళాంబ దేవి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. వాల్ పోస్టర్లను స్వామి, అమ్మవారి పాదాల చెంత ఉంచారు. చైర్మన్, ఈఓ మాట్లాడుతు రాష్ట్రంలోని ఏకైక శక్తిపీఠమైన అలంపూర్ జోగుళాంబ ఆలయంలో ఉత్సవాలు వైభవోపేతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. భక్తుల సహకారం ఎంతో అవసరమన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో నవరాత్రి ఉత్సవాలపై పెద్ద ఎత్తున ప్రచారం కల్పించి భక్తులకు అవసరమైన వసతులు ఏర్పాటు చేస్తామన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ, వెంకటేశ్వర్‌రెడ్డి, నీలప్ప, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

జూరాలకు 10వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఆదివారం రాత్రి 7గంటల వరకు ప్రాజెక్టుకు 10వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైనట్లు పీజేపీ అధికారులు తెలిపారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 7,408, ఆవిరి రూపంలో 95, నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750, ఎడమ కాల్వకు 1,030, కుడి కాల్వకు 731, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 150, సమాంతర కాల్వకు 450, భీమా లిఫ్టు-2కు 750 క్యూసెక్కులతో కలిపి ప్రాజెక్టు నుంచి మొత్తం 10,914 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 9.439 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు.

రాయవరం రైతుల పక్షాన పోరాటానికి సిద్ధం



లింగాలలో మాట్లాడుతున్న గద్దం లక్ష్మణ్

లింగాల: మండలంలోని రాయవరం, చుట్టూ గ్రామాలలో నెలకొన్న భూ సమస్య పరిష్కారం కోసం తాము అండగా ఉంటామని పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గద్దం లక్ష్మణ్ తెలిపారు. భూ సమస్యలను తెలుసుకోవడానికి ఆదివారం నిజ నిర్ధారణ కమిటీ గ్రామాన్ని సందర్శించి వాస్తవ పరిస్థితులను అధ్యాయనం చేశారు. అనంతరం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ భూమి లేని నిరుపేద రైతులు ఏళ్ల తరబడి రెవెన్యూ భూమిని సాగు చేస్తున్నారని తెలిపారు. భూములపై హక్కులు కల్పిస్తామని నాయకులు రైతులను మోసం చేస్తూ వస్తున్నారని విమర్శించారు. తీరా రెవెన్యూ భూమి అటవీ శాఖ మార్పడమే గాక ధరణిలో 83 సర్వే నంబర్ కనిపించకుండా చేశారని విమర్శించారు. రైతులకు భూములపై హక్కులు కల్పించే వరకు రైతులకు మద్దతుగా పౌర హక్కుల సంఘం నిలుస్తుందని తెలిపారు.